క్లుప్తంగా

కింతలి రోడ్డు నిర్మాణం ప్రారంభం



రోడ్డు పనులు ప్రారంభిస్తున్న ఎంపీపీ రాజారామ్ తదితరులు

మాడుగుల: మండలంలో ఘాట్‌రోడ్ – కింతలి రోడ్డు నిర్మాణ పనులకు ఎంపీపీ తాళ్లపురెడ్డి వెంకటరాజారామ్ ఆదివారం కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు కృషి ఫలితంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రూ.9 కోట్లు ఆర్‌అండ్‌బీ నిధులు మంజూరు చేశారన్నారు. ఎంపీటీసీ తలారి అప్పారావు పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జి బొడ్డపు భాస్కరరావు, కోరుకొండ చెల్లంనాయుడు, నాయకులు కరణం రాము, కోట్ని శ్రీరామ్మూర్తి, కాళింగ కల్యాణరాజు, శ్రీనాథు జగ్గారావు, పడాల అప్పలనాయుడు, సయ్యపురెడ్డి సత్తిబాబు, యన్నంశెట్టి వెంకటరావు, పాము వెంకటరావు, గోకేడ అప్పలనాయుడు, ఇందుకూరి నాగరాజు, పర్రె రామునాయుడు, కాళ్ల రాజు పాల్గొన్నారు.

జిల్లా ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శికి సన్మానం



నాగేశ్వరరావును సన్మానిస్తున్న ఏఎంసీ చైర్మన్ శానాపతి కొండలరావు

మాడుగుల రూరల్: వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ జిల్లా ప్రధాన ప్రధాన కార్యదర్శిగా నియమితులైన కుదర నాగేశ్వరరావును ఆదివారం ఆయన స్వగ్రామం ఎం. కోటపాడులో మాడుగుల ఏఎంసీ చైర్మన్ శానాపతి కొండలరావు, ఉప సర్పంచ్ శానాపతి గంగాధర్ సారథ్యంలో అంబేడ్కర్ సంఘం ప్రతినిధులు శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా సన్మాన గ్రహీత మాట్లాడుతూ తన పదవికి వన్నె తెస్తానని, ఈ పదవిలో నియమించిన డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడుకు కృతజ్ఞతలు తెలిపారు. అంబేడ్కర్ యూత్ సభ్యులు కె.పి.నాగేశ్వరరావు, మట్టా పోతురాజు, సూర్యనారాయణ, పెందుర్తి అప్పారావు, వీఆర్పీ మట్టా రాము పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక



పూర్వ విద్యార్థుల కుటుంబాలు

చోడవరం రూరల్: దాదాపు పుష్కరం తర్వాత వారంతా తాము చదువుకున్న కళాశాలలో కలుసుకుని సందడి చేశారు. ఈ ఆత్మీయ కలయికలో వీరంతా తమ పిల్లలతో సహా హాజరు కావడం విశేషం. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 2010–12 విద్యా సంవత్సరాల్లో ఇంటర్మీయట్ సీఈసీ చదివిన విద్యార్థులు ఆదివారం ఈ సమ్మేళనంలో పాల్గొన్నారు. ప్రస్తుతం తాము ఏం చేస్తున్నాం, ఎలా స్థిరపడ్డాం, ఏయే రంగాల్లో ఉన్నాం, పిల్లలు స్థితిగతులను ఒకరినొకరు అడిగి తెలుసుకుని, ఆనాటి తమ కళాశాల అనుభవాలను పంచుకుని టీనేజర్లుగా మారిపోయారు. ఆనాటి విద్యార్థులు తమకు విద్యా బోధన చేసిన ఉపన్యాసకులను గౌరవించి గురుభక్తి చాటుకున్నారు.

హనుమ విగ్రహ నిర్మాణానికి శంకుస్థాపన నేడు



36 అడుగుల విగ్రహం నమూనా

దేవరాపల్లి: స్థానిక నాలుగు రోడ్ల జంక్షన్‌లో అభయాంజనేయ స్వామి వారి 36 అడుగుల భారీ విగ్రహ నిర్మాణానికి సోమవారం శంకుస్థాపన చేయనున్నట్లు వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు కిలపర్తి భాస్కరరావు తెలిపారు. వేద పండితుల మంత్రోచ్ఛరణాల మధ్య భక్తి శ్రద్ధలతో ఉదయం 9:30 గంటలకు ఈ కార్యక్రమం నిర్వహిస్తామన్నారు.

సాయిబాబా మందిర వార్షికోత్సవం నేడు

రోలుగుంట: కొవ్వూరు సాయిబాబా మందిర 24వ వార్షికోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించనున్నట్లు ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు. ఉదయం నుంచి పూజా కార్యక్రమాలు, మధ్యాహ్నం భారీ అన్నసమారాధన ఉంటుందన్నారు.

నెరవేరిన 'ఇంటర్' కల

- కళాశాలగా నాతవరం హైస్కూల్ అప్‌గ్రేడ్
- విద్యార్థులకు తీరనున్న కష్టాలు
- సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు
- టీడీపీ హయాంలో ఆర్భాటానికే పరిమితం



కాలేజీ మంజూరుతో సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు (ఫైల్)



జూనియర్ కాలేజీగా అప్‌గ్రేడ్ అయిన నాతవరం హైస్కూల్ భవనాలు



వచ్చే విద్యా సంవత్సరం నుంచి కాలేజీకి వెళ్లనున్న నాతవరం హైస్కూల్‌లో పదో తరగతి విద్యార్థులు

నాతవరం: వైఎస్సార్‌సీపీ పాలనలో ఏళ్లనాటి కల నెరవేరింది. దశాబ్దాలుగా దూర ప్రాంతాలకు వెళ్లి చదువుతున్న విద్యార్థుల కష్టాలు ఎట్టకేలకు తీరనున్నాయి. ఎమ్మెల్యే పెట్ల ఉమా శంకర్ గణేష్ కృషితో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు విద్యా శాఖ మంత్రి బొత్స సత్యనారాయణ ఇక్కడ పదో తరగతి వరకు ఉన్న హైస్కూల్‌ను జూనియర్ కాలేజీగా అప్‌గ్రేడ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది.

మండలంలో 31 గ్రామ పంచాయతీల్లో 65 పాఠశాలలు ఉన్నాయి. వాటిలో నాతవరం, డి.యర్రవరం, గునుపూడి, తాండవ, చమ్మచింత, మన్యపురట్ల, ఎం.బి.పట్నం హైస్కూళ్లతోపాటు రామన్నపాలెం తాండవ ప్రాంతాల్లో గిరిజన ఆశ్రమ హైస్కూల్ ఉన్నాయి. ఏటా హైస్కూళ్లలో చదివే విద్యార్థులు 1500పైగా ఇంటర్మీడియట్ చదివేందుకు దూర ప్రాంతాలైన నర్సీపట్నం, తుని పట్టణాలకు వెళ్తున్నారు. ఇంతవరకు మండలంలో ప్రభుత్వ జూనియర్ కాలేజీ లేకపోవడంతో చాలా మంది విద్యార్థులు అంత దూరం వెళ్లి చదువుకోలేక పదో తరగతితోనే చదవు ఆపేస్తున్నారు. ఈ నేపథ్యంలో ఎమ్మెల్యే గణేష్, వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత దివంగత అంకంరెడ్డి జమీలు నాతవరంలో జూనియర్ కాలేజీ ఏర్పాటు చేయాలని 2022లో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. ఇటీవల అసెంబ్లీ సమావేశాల సమయంలో ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు వచ్చే విద్యా సంవత్సరం నుంచే నాతవరంలో కాలేజీ ప్రారంభం కావడంతో విద్యార్థులు దూర ప్రాంతాలకు వెళ్లే వ్యయప్రయాస తప్పింది. దీంతో విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, స్వచ్ఛంద సంస్థలు ఉద్యోగులు, డ్వాక్రా మహిళలు హర్షం వ్యక్తం చేశారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతగా ఇటీవల ఇక్కడ హైస్కూల్‌లో సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేసి సంబరాలు చేశారు.

టీడీపీ ప్రగల్భాలు..

ఐదేళ్ల టీడీపీ పాలనలో నాతవరంలో జూనియర్ కాలేజీ ఏర్పాటు చేసేందుకు హడావుడి చేశారు. అధికారులు ఇక్కడ హైస్కూల్ గదులను పరిసరాలను పరిశీలించి కాలేజీ వచ్చేస్తుందని ప్రకటన చేసి వెళ్లిపోయే వారు. స్థానిక టీడీపీ నాయకులు, మాజీ మంత్రి అయ్యన్నపాత్రుడు సైతం ప్రగల్భాలు పలికారు. కాలేజీ వచ్చేస్తుందని ఊరించి ఉసూరుమనిపించారు.

చాలా ఆనందంగా ఉంది



హైస్కూల్‌ను కళాశాలగా అప్‌గ్రేడ్ చేయడం చాలా సంతోషంగా ఉంది. ఇన్నాళ్లూ దూరాభారం వెళ్లి చదువుకోవాల్సి వచ్చేది. ఇప్పుడు మా పిల్లల కష్టాలు తీరనున్నాయి.

– పైల రామలక్ష్మి, పీఎంసీ చైర్‌పర్సన్

అన్ని సదుపాయాలు సిద్ధం



హైస్కూల్‌లో వచ్చే ఏడాది నుంచి జూనియర్ కాలేజీ ఏర్పాటు చేసేందుకు కావాల్సిన అన్ని సదుపాయాలు సిద్ధంగా ఉన్నాయి, నాడు – నేడు పథకంలో అదనపు భవన నిర్మాణాలు తుది దశకు చేరుకున్నాయి.

– తాడి అమృత్‌కుమార్, ఎంఈవో, నాతవరం మండలం

సీఎంకు రుణపడి ఉంటాం



ఎన్నికల ముందు హామీ ఇవ్వలేని పనులను నేను అడిగిన వెంటనే మంజూరు చేయడంతో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి జీవితాంతం రుణపడి ఉంటాను. నా హయాంలో సంక్షేమం, అభివృద్ధితోపాటు శాశ్వతంగా నిలిచిపోయే పనులు చేసేందుకు సీఎం అన్ని విధాలుగా సహకరించారు. ఈ ప్రాంతంలో గత పాలకులు చేయలేని పనులు నేను చేయడం విశేషంగా భావిస్తున్నాను.

– పెట్ల ఉమా శంకర్ గణేష్, ఎమ్మెల్యే

ఉత్తమ సేవలందించిన వలంటీర్లకు గుర్తింపు

డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు



వలంటీర్లను సత్కరిస్తున్న డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు

మాడుగుల: మండలంలో ఉత్తమ సేవలందించి సేవా వజ్ర, సేవా రత్న అవార్డులకు ఎంపికైన వలంటీర్లకు ఘన సత్కారం లభించింది. ఆదివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు సర్టిఫికెట్లు, జ్ఞాపికలు అందజేసి దుశ్శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న కాలంలో ఉత్తమ సేవలందిస్తున్న వలంటీర్లకు మంచి గుర్తింపు దక్కనుందన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ కిముడు రమణమ్మ, వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు రామధర్మజ ఎంపీడీవో కాశీ ప్రసాద్, పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జి పెరుమళ్ల వెంకటరావు, పట్టణాధ్యక్షుడు బొమ్మిశెట్టి శ్రీనివాసరావు, నాయకులు కోరుకొండ చెల్లంనాయుడు, పొలిమేర చిన్నారావు, రాఖీ శ్రీను, జవ్వాది వరహాలు, ఎడ్ల హేమంత్‌కుమార్, కోట్యాడ భాస్కరరావు, కుక్కర శ్రీధర్, సయ్యపురెడ్డి సత్తిబాబు పాల్గొన్నారు.

కల్యాణ మండప నిర్మాణం అభినందనీయం

ప్రారంభించిన ఎమ్మెల్యే గణేష్



కల్యాణ మండపాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ఉమాశంకర్ గణేష్

నర్సీపట్నం: మున్సిపాలిటీలోని 28వ వార్డులో నూతనంగా నిర్మించిన శ్రీకృష్ణదేవరాయ కల్యాణ మండపాన్ని ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వార్డు ప్రజలు శుభకార్యాలు జరుపుకునేందుకు వీలుగా వార్డు వైఎస్సార్‌సీపీ నాయకుడు గొల్లవెల్లి రాము రూ.38 లక్షలతో కల్యాణ మండపం నిర్మించటం అభినందనీయమన్నారు. ప్రజలకు సేవ చేయాలనే తలంపుతో మంచి కార్యానికి శ్రీకారం చుట్టారన్నారు. రాము చేపట్టే కార్యక్రమాలకు తనవంతు సహాయ సహకారాలు ఎప్పుడు ఉంటాయన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్లు కోనేటి రామకృష్ణ, తమరాన అప్పలనాయుడు, మాజీ వైస్ చైర్మన్ గొలుసు నర్సింహమూర్తి, పార్టీ టౌన్ అధ్యక్షుడు ఏకా శివ, సచివాలయాల కన్వీనర్ తమరాన శ్రీను, లయన్స్ గవర్నర్ అధికారి గోపాలరావు, కోఆప్షన్ సభ్యులు ఎండీబాషా, లగుడు స్వామి, పార్టీ నాయకులు గుడబండి నాగేశ్వరరావు, జాన్, చిటికెల కన్నబాబు, మామిడి శ్రీను, లలిత పాల్గొన్నారు.

రూ.10 లక్షలతో బుచ్చింపేటలో రామమందిర నిర్మాణం

నేడు ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ శంకుస్థాపన



ప్లాన్ గీయిస్తున్న సర్పంచ్ ఉలబాల చంద్ర, నిర్మాణ కమిటీ

రోలుగుంట: బుచ్చింపేటలో నూతన రామాలయ నిర్మాణ పనులను ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ ప్రారంభించనున్నారని సర్పంచ్ ఉలబాల చంద్ర తెలిపారు. ఈ మేరకు ఏర్పాట్లు చేశామన్నారు. ఇక్కడ రామ మందిరం శిథిలం కావడంతో అదే స్థలంలో నూతన రామాలయం నిర్మాణానికి నిధుల కోసం ప్రభుత్వం విప్ కరణం ధర్మశ్రీని కలిశామన్నారు. ఆయన కృషితో తిరుపతి తిరుమల దేవస్థానం(టి.టి.డి) ట్రస్టు నుంచి రూ.10 లక్షలు మంజూరైనట్లు తెలిపారు. ఈ నిధులతో ఆలయ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేస్తామన్నారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, మాజీ సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, పార్టీ నాయకులు పాల్గొనాలని పార్టీ మండల ఉపాధ్యక్షుడు ఉలబాల రాము కోరారు.

సేవాభావంతో ప్రతి ఒక్కరూ ముందుకు రావాలి

సత్యసాయి సేవా సంస్థల కోఆర్డినేటర్ సురేష్



వలంటీర్లు చేపట్టాల్సిన సహాయ కార్యక్రమాన్ని వివరిస్తున్న కోఆర్డినేటర్ సురేష్

కె.కోటపాడు: ప్రకృతి విపత్తుల సమయాల్లో సాటి మనిషికి సహాయాన్ని అందించేందుకు సేవాభావంతో ముందుకు రావాలని రాష్ట్ర సత్యసాయి సేవా సంస్థల ప్రకృతి విపత్తుల కోఆర్డినేటర్ బండి సురేష్ కోరారు. ఆదివారం కె.కోటపాడులో ప్రకృతి విపత్తుల సమయాల్లో చేపట్టాల్సిన సేవా కార్యక్రమాలపై అవగాహన కల్పించారు. ప్రమాదాల సమయాల్లో ఎత్తయిన భవనాల్లో ప్రజలను సురక్షితంగా కిందకు రప్పించే విధానాన్ని ప్రత్యక్షంగా చేసి చూపించారు. సామాజిక బాధ్యతతో సేవా కార్యక్రమంగానే ప్రకృతి విపత్తుల సమయాల్లో చేసే సహాయాన్ని గుర్తించాలని తెలిపారు. కార్యక్రమంలో సత్యసాయి సేవా సమితి కన్వీనర్ బండారు నారాయణపాత్రుడు, జిల్లా సేవా సమన్వయకర్త కశిరెడ్డి అప్పలనాయుడు, దార్ల శివ గుర్రన్నాచారి, భీమలింగం పాల్గొన్నారు.

3న పల్స్ పోలియో

మాడుగుల రూరల్: జాతీయ పల్స్ పోలియో కార్యక్రమం వచ్చే నెల 3వ తేదీన నిర్వహించడానికి కార్యాచరణ ప్రణాళిక రూపొందించినట్లు కె.జె.పురం, కింతలి పీహెచ్‌సీ వైద్యాధికారులు ఎల్.వి.ఎస్.ఎస్. ప్రసాదుపాత్రుడు, కె.ఎం.నాయుడు ఆదివారం తెలిపారు. ఐదు వేల మంది చిన్నారులకు పోలియో చుక్కలు వేయనున్నామన్నారు. దీంతోపాటు వద్దాది పీహెచ్‌సీకి సంబంధించి నాలుగు సచివాలయాల పరిధిలోని ఏడు గ్రామాల్లో పోలియో చుక్కలు వేస్తామని వైద్యాధికారి శకుంతల అన్నారు.

దీనికి సంబంధించి ఇప్పటి నుంచే సచివాలయాల వారీగా అవగాహన సదస్సులు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు.

రేపటి నుంచి దేవి తీర్థ మహోత్సవాలు

గోడ పత్రికను ఆవిష్కరించిన డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు



గోడ పత్రికను ఆవిష్కరిస్తున్న డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు

దేవరాపల్లి: స్థానిక ఉమామహేశ్వరి దేవి తీర్థ, కల్యాణ మహోత్సవాల గోడపత్రికలను వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు కిలపర్తి భాస్కరరావు ఆధ్వర్యంలో డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు ఆదివారం ఆవిష్కరించారు. ఈ నెల 20 నుంచి 25వ తేదీ వరకు కల్యాణ తీర్థ మహోత్సవాలను నిర్వహిస్తామని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఆఖరి రోజు 25న అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ఈ మేరకు డిప్యూటీ సీఎంకు ఆహ్వాన పత్రికను అందజేశారు. తొలి రోజు 20న గణపతి పూజ, పుణ్యాహవచనం, అంకురార్పణ, ధ్వజారోహణ, అనంతరం రాత్రి 7:30 గంటలకు అమ్మవారి కల్యాణ మహోత్సవాన్ని కనుల వైభవంగా నిర్వహిస్తామని అర్చకులు తెలిపారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ కర్రి సత్యం, వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు బూరె బాబూరావు, కొప్పుల వెలమ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ డాక్టరు వరదపురెడ్డి సింహాచలంనాయుడు, ఎంపీటీసీ మొల్లి కృష్ణమూర్తి, గండిపడాల అప్పలరాజు, గుండు రాంబాబు, వాలేటి నాగరాజు, సోమిరెడ్డి పేరునాయుడు, సబ్బవరపు మాలిబాబు, చల్లా నాయుడు, గ్రామ పెద్దలు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

పుస్తక పఠనంతో విజ్ఞానం



పుస్తక పఠనం చేస్తున్న విద్యార్థులతో లైబ్రేరియన్ శ్రీనివాసరావు

దేవరాపల్లి: ప్రతీ విద్యార్థి పుస్తక పఠనాన్ని అలవర్చుకోవాలని గ్రంథపాలకుడు ఓ. శ్రీనివాసరావు తెలిపారు. ఈ మేరకు ఆదివారం స్థానిక శాఖా గ్రంథాలయంలో «చదవడం మాకిష్టం» కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పుస్తక పఠనం ఆవశ్యకతను, కలిగే ప్రయోజనాలను విద్యార్థులకు వివరించారు. పుస్తక పఠనంతో విజ్ఞానాన్ని పెంపొందించుకుని ఉజ్వల భవిష్యత్‌కు బాటలు వేసుకోవచ్చన్నారు. విద్యార్థులతో జనరల్ నాలెడ్జ్, కథలు, దినపత్రికలను చదివించారు.

ఘనంగా గౌరీపరమేశ్వర ఉత్సవాలు



అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు



గౌరీపరమేశ్వరులను పల్లకిలో ఊరేగిస్తున్న భక్తులు



ఆకట్టుకున్న నృత్యాలు

గొలుగొండ: జోగుంపేటలో గౌరీపరమేశ్వర ఉత్సవాలు ఆదివారం పెద్ద ఎత్తున నిర్వహించారు. కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో భారీ విద్యుత్ అలంకరణ, తదితర ఏర్పాట్లు చేశారు. భక్తులు గౌరీపరమేశ్వరుని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. రాత్రి తీర్థ మహోత్సవాలు నిర్వహించగా, చుట్టుపక్కల గ్రామా ల నుంచి గొలుగొండ, జానకీరాంపురం, నర్సంగబిల్లి, సాలికమల్లవరం, జమ్మాదేవిపేట, వెంకటాపురం ప్రజలు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న నృత్యాలు

రోలుగుంట: కొవ్వూరులో గౌరీపరమేశ్వరుల ఉత్సవాల్లో భాగంగా ఆదివారం పెద్ద తీర్థం ఘనంగా నిర్వహించారు. దీనిలో భాగంగా గ్రామ వీధులను కనులు మిరుమిట్లు గొలిపే విధంగా రంగురంగుల విద్యుత్ బల్బులతో దేవతామూర్తుల చిత్రాలతో అలంకరించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు యువకులు పలు వేషాలు ప్రదర్శించారు. రాత్రికి గ్రామ వీధుల్లో పలు నృత్యాలు, డప్పువాయిద్యాలతో బాణసంచా కాల్చుతూ భక్తుల సందర్శనార్థం పల్లకిపై ఉత్సవమూర్తులను ఊరేగించారు. పల్లకిని మోసేందుకు భక్తులు పోటీపడ్డారు. ఉత్సవమూర్తులను ఎంపీపీ యర్రంశెట్టి శ్రీనివాసరావు, సర్పంచ్ కాంతమ్మ, రోలుగుంట పీఏసీఎస్ డైరెక్టర్ బాబూరావు దంపతులు దర్శించుకున్నారు. గ్రామ వీధుల్లో స్టేజీ ప్రోగ్రాంలు ఏర్పాటు చేశారు. గౌరీపరమేశ్వరులను స్థానిక చెరువులో సోమవారం నిమజ్జనం చేస్తామని ఈ సందర్భంగా ఉత్సవ కమిటీ చైర్మన్ యర్రంశెట్టి రాజారావు తెలిపారు.

అలరించిన కీర్తనలు

యలమంచిలి : సద్గురు త్యాగరాజ స్వామి వారి ఆరాధనోత్సవాలు ఆదివారం యలమంచిలి పట్టణం కొత్తపేట రామాలయంలో ఘనంగా నిర్వహించారు. త్యాగరాజ ఆరాధనోత్సవాలలో భాగంగా యలమంచిలి పట్టణంలో గాత్ర కచేరీ, సంగీత వాగ్గేయ కారులు త్యాగరాజస్వామి కీర్తనలు ఆలపించారు. ఈ సందర్భంగా త్యాగరాజ స్వామి వారి గొప్పతనాన్ని స్మరించుకుని వారి గీతాలు ఆలపించారు.

నేటి నుంచి ప్రతిభాపాటవ పోటీలు

మాకవరపాలెం: ఉగాది వేడుకల్లో భాగంగా ఈ నెల 19 నుంచి మార్చి 2వ తేదీ వరకు విద్యార్థులకు ప్రతిభా పాటవ పోటీలు నిర్వహించనున్నట్టు గౌతమి లలిత కళా శిక్షణా కేంద్రం అధ్యక్ష, కార్యదర్శులు రంగరాజు, శేషగిరిరావు ఆదివారం తెలిపారు. ఈ నెల 19న వ్యాసరచన, 20న స్పెల్ బి, 21న చదరంగం, 28న చిత్రలేఖనం, 29న క్విజ్, మార్చి 1న నృత్యం, 2న పాటలు, తెలుగు, ఇంగ్లిష్ రైమ్స్ పోటీలు నిర్వహిస్తామన్నారు. స్థానిక ఉన్నత పాఠశాలలో జరిగే మండల స్థాయి పోటీల్లో మూడో తరగతి నుంచి ఇంటర్ వరకు విద్యార్థులు పాల్గొనవచ్చన్నారు.

చురుగ్గా రహదారి నిర్మాణం

- రూ. 2.80 కోట్లతో మామిడిపల్లి – ఎం.అలమండ రోడ్డు పనులు



పొక్లెయిన్‌తో మట్టి చదును చేస్తున్న దృశ్యం



విస్తరించడంతో విశాలంగా దర్శనమిస్తున్న ఎం.అలమండ-మామిడిపల్లి రహదారి

దేవరాపల్లి: మండలంలోని ఎం. అలమండ–మామిడిపల్లి రోడ్డుకు మహర్దశ పట్టింది. డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు ప్రత్యేక చొరవతో ఈ రెండు గ్రామాల ప్రజల చిరకాల వాంఛ నెరవేరుతోంది. ఎన్నో ఏళ్లుగా వేధిస్తున్న ఈ సమస్యను ఆయన ఇటీవల సీఎం జగన్ దృష్టికి తీసుకెళ్లగా రూ. 2.80 కోట్లు మంజూరు చేశారు. ఈ నిధులతో తారురోడ్డు నిర్మాణ పనులను రెండు గ్రామాల సర్పంచ్‌లు దాడి జగన్, కర్రి సూరినాయుడు, ఎం. అలమండ మాజీ సర్పంచ్ పోతల లక్ష్మి ఇటీవల ప్రారంభించారు. ప్రస్తుతం పొక్లెయిన్‌లతో మట్టి చదును చేసే పనులు శరవేగంగా సాగుతున్నాయి. 4.5 కిలోమీటర్ల మేర మట్టి పనులు పూర్తి కాగానే తారురోడ్డు నిర్మించనున్నారు. రెండు గ్రామాల ప్రజలు ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలియజేస్తున్నారు.

బుచ్చెయ్యపేటలో విభిన్న వాతావరణం

ఉదయం పొగమంచు – మధ్యాహ్నం తీవ్ర ఎండ



బుచ్చెయ్యపేట రోడ్డులో కురుస్తున్న పొగమంచు



ఎండ తీవ్రతకు నిర్మానుష్యంగా బీఎన్‌రోడ్డు

బుచ్చెయ్యపేట: మండలంలో వారం రోజులుగా విభిన్న వాతావరణం కనిపిస్తోంది. ఏజెన్సీని తలపించేలా ఉదయం దట్టంగా పొగమంచు కురవడంతోపాటు చలిగాలులు ఎక్కువగా వీస్తున్నాయి. రాత్రి ఏడు గంటల నుంచి ఉదయం ఏడు గంటల వరకు చలి తీవ్రత ఎక్కువగా ఉంటోంది. ఉదయం 9 నుంచి సాయంత్రం వరకు తీవ్రంగా ఎండ కాస్తోంది. ఇలాంటి వాతావరణంతో ప్రజలు అల్లాడుతున్నారు.

21న బీజేపీ ప్రజా పోరు యాత్ర

- రాష్ట్ర అధికార ప్రతినిధి శ్రీరామ్మూర్తి

చోడవరం: బీజేపీ ప్రజా పోరు యాత్రను పార్టీ శ్రేణులు, ప్రజలంతా విజయవంతం చేయా లని ఆ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఈర్లె శ్రీరామ్మూర్తి కోరారు. స్థానిక బీజేపీ కార్యాలయంలో ఆదివారం ఆయన మాట్లాడారు. ఈ నెల 21 నుంచి 29వ తేదీ వరకూ అనకాపల్లి జిల్లాలో ఈ ప్రజా పోరు యాత్ర నిర్వహిస్తామన్నారు. ఈ యాత్రకు తనను పార్లమెంటరీ కన్వీనర్‌గా పార్టీ నియమించిందన్నారు. కేంద్ర ప్రభుత్వ పథకాలను క్షేత్రస్థాయిలో ప్రజలకు తెలియజేస్తూ ప్రచారం చేస్తామన్నారు. వచ్చే ఎన్నికల్లో విజయానికి పార్టీని మరింత బలోపేతం చేసే దిశగా చర్యలు చేపట్టామన్నారు. సమావేశంలో బీజేపీ ప్రతినిధులు కందర్ప రమణ మూర్తి, ఎం. శ్రీనివాసరావు, అప్పలకొండ కుమార్, బుద్ద అమర్, సీతా నాగరాజు, పరవాడ మురళి పాల్గొన్నారు.